కథ

# తోడొకరుండిన...

- వంగీపురం పద్మనాభన్

**"నాన్నా** సుదన్ ! టైమయిపోతోంది.... యింక నిద్రలేవరా! తర్వాత మళ్లీ హడావుడి పడతావు!" యింకా బెడ్ మీదే వున్న కొడుకుని లేవమంటోంది కమలమ్మ !

"సుదన్ లే! ఈరోజు 9 గంటలకే బ్యాంక్‌కి వెళ్ళాలన్నావుగా. ఇప్పుడు లేస్తేగాని టైమ్ సరిపోదు" గుర్తుచేస్తూ మళ్ళీ లేపింది. బద్ధకంగా ఒళ్ళు విరుచుకుంటూ లేచి గడియారం వంక చూశాడు. అప్పుడు టైమ్ 7-10 అయింది. త్వరగా బ్యాంక్‌కి వెళ్ళాలనే విషయం గుర్తుకు వచ్చి హడావుడిగా లేచి బాత్‌రూం వైపు పరుగులు తీశాడు. సుదర్శన్ బ్యాంక్‌లో ఆఫీసర్‌గా పనిచేస్తున్నాడు.

కమలమ్మ ఎప్పుడూ 7 గంటలకే వంట సిద్ధం చేస్తుంది. ఈ మధ్య కాలంలో బ్యాంక్‌లో పని ఒత్తిడి ఎక్కువయి, అసలు టైమింగ్స్ మారిపోయి ఎప్పుడు పడితే అప్పుడు పోవటం... అలాగే రాత్రికి రావటం కూడా వాళ్ళ చేతిలో లేదు.

ముందురోజు బాగా పొద్దుపోయే వరకు పని చేసినా కావలసిన పని పూర్తి కాలేదు. ఈరోజు రిపోర్టు హెడ్‌ఆఫీస్‌కి వెళ్ళిపోవాలి. ఎట్టి పరిస్థితులలోనూ ఈరోజు రిపోర్టు వెళ్ళిపోవాలని బ్యాంక్ మేనేజర్ హుకుం జారీ చేశాడు.

సుదర్శన్ పనులన్నీ పూర్తి చేసుకుని టైమ్ కి చేరుకోగలిగాడు. కమలమ్మ, కమలాకరరావు దంపతులకి ముగ్గురు పిల్లలు. సుదర్శన్ ఒక్కడే కొడుకు, ఇద్దరు కూతుళ్ళు. మధ్యతరగతి కుటుంబం కావటం చేత సామాజిక బాధ్యతగా సుదర్శన్ చెల్లెళ్ళిద్దరికీ మంచి సంబంధాలు చూసి పెళ్ళిళ్ళు చేసేశాడు. అతను ఇంకా పెళ్ళి చేసుకోలేదు. వయసు 45. బ్యాంక్ పనికే అంకితమైపోవడం వల్ల పెళ్ళి ధ్యాస రాలేదు.

కమలమ్మ ఎప్పుడూ అంటూ వుంటుంది "ఏరా! ఏదైనా మంచి సంబంధం, మనకు సరిపడే సంబంధం చూద్దాం పెళ్ళి చేసుకోరా! ఇలాగే ఎంతకాలం వుంటావు!" అని దయనీయంగా అడుగుతూ "నీ మనసులో ఎవరైనా ఉన్నారేమో చెప్తే ఆ అమ్మాయి తరపువాళ్ళను కలసి మాట్లాడతాము" అని తరచూ సుదర్శన్ చెవిలో ఇల్లు కట్టుకుని పోరుతూ వుంటుంది. అయినా ససేమిరా అతను ఉలకడు పలకడు. "చూద్దాంలేమ్మా! ఇప్పుడేం తొందరా!" అని తన వైపు నుంచి తోసి పారేస్తూ వుంటాడు. "అదేంటి వయసు 45 దాటింది. ఇంకెప్పుడు పెళ్ళి చేసుకుంటావు? ఎప్పుడు పిల్లల్ని కంటావు? ఎప్పుడు వాళ్ళని పెంచి పెద్ద వాళ్ళని చేస్తావు? ఒరే! నట్టింట్లో పిల్లలు తిరుగుతూ వుంటే ఇంటికి ఎంత శోభ తెలుసురా? ఎంత మంగళకరం తెలుసా నీకు?" ఒప్పించబోయింది కమలమ్మ.

ఇవన్నీ ప్రేక్షకుడిలా చూస్తూ వుండిపోతారు సుదర్శన్ నాన్న కమలాకరరావు గారు. ఆయనకి ఇలా బతిమాలటం ఇష్టం ఉండదు.

ఎప్పుడైనా "ఏవండీ! మీరైనా చెప్పరా!" అంటే "ఎవరి ఇష్టం వాళ్ళదే! పిల్లలు పెద్ద వాళ్ళయిపోయారు. వాళ్ళకి విచక్షణా జ్ఞానం ఉంది. ఏది మంచో, ఏది చెడో వాళ్ళకు తెలుసు. ఇవన్నీ వాళ్ళ ఇష్టాలకే వదిలేయాలి" అని చల్లగా తప్పుకుంటారు.

సుదర్శన్ అమ్మ మాట తలచుకుని తనలో తనే మథన పడుతుంటాడు. "ఎప్పుడు పెళ్ళి చేసుకుంటావు? ఎప్పుడు పిల్లల్ని కంటావు? ఎప్పుడు వాళ్ళని పెంచి పెద్ద చేస్తావు?"

ఆరోజు ఎలాగో ఒక గంటలో పని పూర్తిచేసి రిపోర్ట్ మేనేజర్ చేత సంతకం చేయించి హెడ్ ఆఫీసుకి పంపేశాడు. అయినా మేనేజర్‌కి కృతజ్ఞతా భావం లేదు. అందుకే పని అంటే విసుగు పుడుతుంది సుదర్శన్‌కి. ఇక రోజువారీ పనిలో నిమగ్నమైపోయాడు సుదర్శన్.

"ఎక్స్‌క్యూజ్‌మీ" సన్నగా, మృదువుగా వీణ మీటినట్లు ఒక గొంతు వినిపించింది.

తలెత్తి చూశాడు. ఎప్పుడూ, ఎవరో ఒకరు వచ్చి ఏదో ఒకటి అడగటం పరిపాటి. దానికి అతను సమాధానం చెప్పి పంపేస్తుంటాడు. కాని ఎదురుగా ఒక అమ్మాయి,

"నేను గంట క్రితం డ్రాఫ్ట్ కోసం అప్లై చేశాను. ఇంకా ఇవ్వలేదు. ఇక్కడ బోర్డులోనేమో డ్రాఫ్ట్ 15 నిమిషాలకే ఇవ్వబడును అని వ్రాసి వుంది. మేనేజర్‌ని సంప్రదిస్తే ఆయన మిమ్మల్ని అడగమన్నారు. అని ఫిర్యాదులాగా కాకుండా, మందలింపుగా అడిగింది.

చీర కొంగును మెడపై నుంచి నిండుగా కప్పుకుని నిర్మలంగా నిలబడి వుంది. అతను ఒక్క క్షణం ఏమీ మాట్లాడలేకపోయాడు. ఆమె మళ్ళీ "ఎక్స్‌క్యూజ్‌మి" అని గట్టిగా అంది. అప్పుడు తేరుకుని "మే ఐ హెల్ప్ యూ" అన్నాడు సుదర్శన్. "నేను గంట క్రితం డ్రాఫ్ట్ కోసం అప్లై చేశాను. ఇంకా ఇవ్వలేదు. ఇక్కడ బోర్డులోనేమో డ్రాఫ్ట్ 15 నిమిషాలకే ఇవ్వబడును అని రాసి వుంది. మేనేజర్‌ని సంప్రదిస్తే ఆయన మిమ్మల్ని అడగమన్నారు'' అని ఫిర్యాదులాగా కాకుండా, మందలింపుగా అడిగింది.

"మీరు అన్నది, బోర్డు మీద వున్నది రెండూ కరక్టేనండి, కాని డ్రాఫ్ట్ ప్రింట్ చేసే ప్రింటర్‌లో కొంత టెక్నికల్ ప్రాబ్లమ్ వచ్చింది. ఫోన్ చేశాం. టెక్నీషియన్ వచ్చేస్తారు. ప్రింటర్ రెడీ అవ్వగానే, మీకు డ్రాఫ్ట్ ఇచ్చేస్తాం. బైది బై మీ పేరేంటి?'' అడిగాడు సుదర్శన్.

"ఇప్పుడు అది అంత అవసరమా? నేను ఇక్కడే వుంటానుగా డ్రాఫ్ట్ వచ్చినప్పుడు, నేనే వచ్చి చెప్తాను" అంది.

"అది కాదండి, డ్రాఫ్ట్ ఇష్యూ ఆలస్యమయినందుకు ఇప్పటి వరకూ ఎవరూ మీలాగ వచ్చి అడగలేదు. మీరు తొందర్లో ఉన్నారని అనిపిస్తోంది. డ్రాఫ్ట్ ప్రింట్ అయిన వెంటనే మీ పేరు గుర్తించి త్వరగా అందచేద్దామని అడిగాను'' అన్నాడు సుదర్శన్.

అతని తర్కం కూడా సముచితమనిపించింది. ఇంట్లో అమ్మ ఒక్కత్తే ఉంది. త్వరగా వెళ్ళాలి అని అనుకుంటూ-

"నా పేరు సుగుణండి ! " అంది.

"వెరీ నైస్!!" అన్నాడు.

"ఆఁ" అని చిరు కోపంతో చూసింది.

"ఏమీ లేదండి. మీరు పరిస్థితిని అర్థంచేసుకుని పేరు చెప్పినందుకు అలా అన్నాను''

"ఓకే. నేను వెళ్ళి అక్కడ సోఫాలో కూర్చుంటాను" అని లేవబోయింది సుగుణ.

"అబ్బే అక్కర్లేదండి. ఇక్కడ నా ఎదురుగా కూర్చోండి. డ్రాఫ్ట్ అవ్వగానే ఇక్కడే ఇచ్చేస్తాను. మీకు సమయం కూడా ఆదా అవుతుంది'' అన్నాడు. ఆమె సమయం గురించి కాదు గాని, ఆమెతో ఎక్కువసేపు మాట్లాడ్డానికి అలా అన్నాడు. ఎందుకో ఆమెను చూసినప్పటి నుంచి సుదర్శన్ మనసు కకా వికలమయ్యింది. మనసు పరిపరివిధాల ఆలోచిస్తోంది. ఆమెకు పెళ్ళి అయిందో లేదో తెలుసుకోవాలి. మెడ చుట్టూ చీర కొంగు ఉండడంతో అది కనిపెట్టడం సాధ్యం కాలేదు. చీర లక్షణంగా కాలి వేళ్ళు కూడా కనపడనంత నిండుగా కట్టుకుని ఉంది. కాలి మెట్టెలు చూద్దామన్నా అది సాధ్యం కాలేదు.

ఇంతలో ప్రింటర్ రిపేర్ అవ్వడంతో, డ్రాఫ్ట్ ప్రింట్ చేయించి, సంతకం చేయించి ఆవిడకు అందజేస్తూ "మీకు ఈ బ్రాంచిలో ఏమైనా సమస్య ఉంటే తప్పక నన్ను కలవండి" అన్నాడు.

"అలాగే, థాంక్స్'' అని డ్రాఫ్ట్ అందుకుని వెళ్ళిపోయింది.

ఆవిడ వెళ్ళగానే ఆ డ్రాఫ్ట్ తాలూకా అప్లికేషన్ తీసి చూశాడు. అందులో అడ్రస్ ఉంటుంది. ఆవిడ ఉంటున్నది ఈ ఏరియాలోనే ! ఏదో పై చదువు కోసం అవిడ ఆ డ్రాఫ్ట్ తీసుకుంది. అడ్రస్ మనసులోనే పదిలంగా దాచుకున్నాడు సుదర్శన్.

ఆరోజు మనసు దారి తప్పటంతో ఒకటి, రెండు తప్పులు చేసి మేనేజర్ దగ్గర చీవాట్లు తిన్నాడు.

'ఎప్పుడూ తప్పులు చేయనివాడు ఈరోజు ఎందుకో తప్పులు చేసి చీవాట్లు తిన్నాడు' అని మిగతా స్టాఫ్ కూడా ఆశ్చర్యపోయారు.

అది మొదలు అతనికి సుగుణ గురించి తెలుసుకునే తపన ఎక్కువయింది....

ఒక రోజు అదృష్టవశాత్తు సుగుణ వాళ్ళ అమ్మను వెంటబెట్టుకుని బ్యాంక్‌కి వచ్చింది. సుగుణ నాన్న చనిపోయి చాలా కాలమయ్యింది. ఆయన తాలూకు పెన్షన్ వాళ్ళమ్మ డ్రా చేస్తూ వుంది. అందుకని ఆవిడ బ్యాంక్ కి రావలసి వచ్చింది. సుగుణ నేరుగా సుదర్శన్ దగ్గరకు వచ్చి "అమ్మా ఈయననే! ఆరోజు డ్రాఫ్ట్ విషయంలో సహాయం చేశారు" అంది. "ఈయన పేరు..... " అని ఆగిపోయింది. ఆ రోజు కనుక్కోవడం మరిచిపోయింది.

"నా పేరు సుదర్శన్".

"ఏంకావాలో చెప్పండి" అన్నాడు.

"ఏమీ లేదు నాయనా! నా పెన్షన్ డ్రా చేయాలి. నేను ఎక్కువ సేపు కూర్చోలేను. త్వరగా ఇప్పిస్తే మంచిది" అంది సుగుణ వాళ్ళ అమ్మ.

"అలాగేనండి! మీరు విత్‌డ్రా ఫారం ఇచ్చేశారా?" అని అడిగాడు.

"లేదండి ఇంకా ఇవ్వలేదు. నేరుగా మీ దగ్గరకే వచ్చాం" అంది సుగుణ.

ఒక విత్‌డ్రా ఫారం తీసి వాళ్ళ అమ్మ చేత సంతకం చేయించి, మిగతా వివరాలు కనుక్కుని ఫిల్ చేసి నిముషాల్లో స్వయంగా డబ్బులు తీసుకొచ్చి అప్ప చెప్పాడు.

"చాలా మంచిది నాయనా! మీరు ఉండబట్టి పని త్వరగా అయ్యింది" అని అంది సుగుణ వాళ్ళ అమ్మ.

"అదేంటండీ! నేను చిన్న వాణ్ణి నన్ను "మీరు" అని పిలవటమేంటి ? నన్ను మీరు ఏక వచనంతో పిలవవచ్చు" అన్నాడు.

"అలాగే నాయనా! నీలాంటి వాళ్ళు చాలా అరుదు ఈ కాలంలో వెళ్ళి వస్తాం అబ్బాయ్! "అని లేచి వెళ్ళిపోయారు.

సుదర్శన్‌లో ఆరోజు ఉత్సాహం రెట్టింపయింది. ఎంత పని వచ్చి పై బడ్డా ఇట్టే ముగించేస్తున్నాడు.

**ఒక రోజు అదృష్టవశాత్తు సుగుణ వాళ్ళ అమ్మను వెంటబెట్టుకుని బ్యాంక్‌కి వచ్చింది. సుగుణ నాన్న చనిపోయి చాలా కాలమయ్యింది. ఆయన తాలూకు పెన్షన్ వాళ్ళమ్మ డ్రా చేస్తూ వుంది. అందుకని ఆవిడ బ్యాంక్ కి రావలసి వచ్చింది.**

ఒక సెలవురోజు సుదర్శన్, సుగుణలు పరస్పరం బజార్లో ఎదురుపడ్డారు. సుదర్శన్‌కి, సుగుణతో మాట్లాడాలనే ఉత్సాహం ఉండడంతో ముందుగా తనే స్పందించాడు.

"హలో ఎలా ఉన్నారు! అమ్మగారు బావున్నారా?" అడిగాడు.

"బావున్నానండి, అమ్మ కూడా బావుంది" జవాబిచ్చింది.

"ఏమిటి ఇలా ఇంత దూరం!" మళ్ళీ అడిగాడు సుదర్శన్.

"అమ్మకు మందులు కొందామని వచ్చాను" అంది.

"కొన్నారా? " అడిగాడు.

"పనైపోయిందండి. ఇంటికే వెళుతున్నాను" అంటూ అడుగు ముందుకేసింది.

"అదేమిటి మీరొక్కరే వొచ్చారు, మీవెంట తోడు ఎవరూ రాలేదా?" అని ఇన్వెస్టిగేటివ్‌గా అడిగాడు.

"నా కెవరున్నారండి. నాకు మాఅమ్మ. అమ్మకునేను. అమ్మ ఇంత దూరం రాలేదు. మీకు తెలుసుకదా!"

"అవునవును. అయితే మీకు పెళ్ళి కాలేదా?" అని హోప్‌ఫుల్‌గా అడుగుతూ అసలు విషయానికి వచ్చాడు.

"లేదండి. అమ్మ తెలిసిన వాళ్ళ ద్వారా సంబంధాలు చూసింది. నేనే వొద్దన్నాను. నాకు పెళ్ళయితే మా అమ్మను ఎవరు చూసుకుంటారు! సంసార బంధంలో పడిపోతే నాకు సమయం దొరక్కపోవచ్చు. అందుకే నేను

"మనకున్నదాంట్లో పద్ధతిగా కాలం గడిపితే అంతకన్నా ప్రశాంతమైన జీవితం వుండదండి. జీవితంలో ఆశయాలు వుండొచ్చు కానీ, ఆశలు వుండకూడదండి. నాకు జీవితంపైన ఖచ్చితమైన అభిప్రాయముందండి"

కూడా ఉద్యోగానికి పోవడం లేదు. అమ్మకు వచ్చే పెన్షన్‌తోనే సర్దుకుంటున్నాం. అయినా ఈ కాలంలో ఉద్యోగం ఉంటేనే పెళ్ళి కావటం చాలా కష్టం. అటువంటిది ఈ పరిస్థితుల్లో నాకు పెళ్ళి అన్నది చాలా కష్టం. సారీ నా పర్సనల్ ప్రాబ్లమ్స్ చెప్పి మిమ్మల్ని ఇబ్బంది పెట్టినట్లున్నాను" అని బాధగా అంది సుగుణ.

సుదర్శన్‌కి పెద్ద బరువు దింపినట్లయింది. మనసు దూది పింజలా తేలికైంది.

"ఛఛ! అవేం మాట్లండి! బాధలు పంచుకుంటేనే మనసు తేలికౌతుందని అంటారు. ఫరవాలేదు చెప్పండి" ఆసక్తిగా అడిగాడు.

"అదేవిటి! అన్నీ నన్నే చెప్పమంటున్నారు. మీ గురించి చెప్పరా!" నిలదీసింది.

"ఓ ! అవునుకదూ! మా అమ్మ నాన్న... ముగ్గురు పిల్లలమండి. పెద్దవాణ్ణి నేను. ఇద్దరు చెల్లెళ్ళకు పెళ్ళిళ్ళు చేశాను. నాకు ఇంకా పెళ్ళికాలేదు. నేను కూడా మా అమ్మనాన్నల గురించే పెళ్ళి చేసుకోలేదు" అన్నాడు.

"అమ్మా నాన్నల గురించి పెళ్ళి మానేయుటమేంటి?" ఎదురు ప్రశ్న వేసింది సుగుణ.

"మా అమ్మ నాన్నలకు వయసయింది. ఈ వయసులో వాళ్ళకు సేవలు చేయాల్సిన బాధ్యత నామీదుంది. వచ్చే అమ్మాయి ఒకవేళ గయ్యాళి అయితే.... ఆగిపోయాడు.

సుగుణ అది బజారు అని కూడా చూడకుండా బిగ్గరగా నవ్వింది.

"రాబోయే అమ్మాయి గురించి ముందుగానే బెంగ పెట్టుకుంటే ఎలాగండి" ధైర్యం చెప్పింది.

"ఏవైనానండి, ఈ విషయంలో నేను ఒక నిర్ణయానికి రాలేకపోతున్నాను. అవును జీవితం మీద మీ అభిప్రాయమేమిటి" అని అడిగాడు.

"ఏముందండి, పిండి కొద్ది రొట్టె" అని చాలా తేలిగ్గా చెప్పేసింది.

"అంటే" ఆశ్చర్యంగా అడిగాడు.

"మనకున్నదాంట్లో పద్ధతిగా కాలం గడిపితే అంతకన్నా ప్రశాంతమైన జీవితం వుండదండి. జీవితంలో ఆశయాలు వుండొచ్చు కానీ, ఆశలు వుండకూడదండి. నాకు జీవితంపైన ఖచ్చితమైన అభిప్రాయముందండి" అనింది.

ఇంతలో వాళ్ళు విడిపోయే కూడలి వచ్చింది.

"మీరు ఎటువైపు వెళ్ళాలి. అని అడిగాడు సుదర్శన్.

"కుడివైపుకండి. మీరు?" అని అడిగింది.

"నేను ఎడమవైపు. అయితే సెలవండి మళ్ళీ కలుద్దాం." అని తిరగబోయాడు.

"ఎలాగూ ఇంత దూరం నడిచి వచ్చాం. ఇంకో నాలుగడుగులు వేస్తే మా ఇల్లు వస్తుంది. రండి, మా ఇంట్లో కాఫీ తాగి వెళుదురుగాని" అని ఆహ్వానించింది.

మనసులో సంపూర్ణంగా వెళ్ళాలని వున్నా మొహమాటం కొద్దీ....

"వొద్దులెండి. ఈసారి ఎప్పుడైనా వస్తాను" అని ఆ నాలుగడుగులు ఏడడుగులుగా మారితే ఎంత బాగుంటుంది అని మనసులోనే అనుకున్నాడు.

"అదేవిటండీ! మాకు ఎంత సహాయం చేశారు మీరు. ఒక్కసారి మా ఇంటికి రావచ్చుగా" అని నిష్టూరంగా అంది.

అదే తడవుగా "సరే! వెళదాం పదండి!" అన్నాడు.

రెండు నిముషాల్లో ఇల్లు చేరుకున్నారు.

**"నేను కొంత కాలం క్రితం ఒక అమ్మాయిని చూశాను. అమ్మాయి పేరు సుగుణ. పేరుకు తగ్గట్టుగా ఉంటుంది. వాళ్ళ అమ్మతో ఇక్కడికి దగ్గర్లోనే వుంటోంది. నాన్న లేరు ఆ అమ్మాయికి కూడా పెళ్ళి కాలేదు. వాళ్ళ అమ్మ తప్ప బాధ్యతలు ఏమీ లేవు. కాని వాళ్ళమ్మ ఒంటరైపోతుందని, ఆ అమ్మాయి పెళ్ళి చేసుకోలేదట."**

"మీ ఇల్లు చాలా దగ్గరేనండి, చాలా దూరం అనుకున్నాను" అంటూ ఇంటికి తాళం వేసి వుండటం గమనించాడు.

"ఏంటి మీ అమ్మగారు ఇంట్లోలేరా?" అని అడిగాడు.

"ఎందుకు లేదు! ఆవిడ ఎక్కడికి వెళ్ళలేదు కాబట్టి ఆవిడను ఇంట్లోనే ఉంచేసి నేను తాళం వేసుకుని బయటకు వెళతాను"

"మరి యెవరైనా వస్తే !"

"తెలిసినవాళ్ళు వస్తే ఆవిడదగ్గర ఇంకో సెట్ కీస్ ఉన్నాయి. కిటికీలో నుంచి ఇచ్చి తాళం తీసుకుని లోపలికి రమ్మంటుంది" అని వివరిస్తూ తాళం తీసి లోపలికి వెళ్ళింది.

సుదర్శన్ కూడా ఇంట్లోకి ప్రవేశిస్తూ అంతా పరికించాడు. ఇల్లు బాగానే వుంది. వున్న దాంట్లో చాలా శుభ్రంగా, ఎక్కడ వస్తువులు అక్కడ వున్నాయి. స్థూలంగా ఒక మ్యూజియం చూస్తున్నట్టుగా వుంది. సుగుణ వాళ్ళ అమ్మ ఒక మూల కూర్చొని ఏదోపుస్తకం చదువుతోంది.

"నమస్కారమండి! బావున్నారా?" కుశల ప్రశ్న వేశాడు.

"రా నాయనా కూర్చో!" గుర్తు పట్టి అంది ఆవిడ.

"అమ్మా, నేను ఈయన్నిబజారులో చూశాను. మాట్లాడుతూ మన ఇంటి దరిదాపుల్లోకి వచ్చాము. అందుకే మన ఇంటికి పిలిచాను" అని వాళ్ళ అమ్మకు చెప్పింది.

"అదేవిటి? నేనేమన్నా సంజాయిషీ అడిగానా? సరే, అబ్బాయి ఇప్పుడు మన అతిథి, వెళ్ళి కాఫీ పట్రా" పురమాయించింది.

"అలాగే! మాట్లాడుతూ వుండండి. ఇప్పుడే కాఫీ తెస్తాను" అని వంటింట్లోకి వెళ్ళింది సుగుణ.

"మీ అమ్మాయి మీ కుటుంబ విషయాలు అన్నీ చెప్పిందండి. తనకు పెళ్ళి కాలేదు అన్నప్పుడు చాలా బాధ పడ్డాను" అని అన్నాడు.

"అదే నాయనా నా ప్రారబ్దం! నా గురించి అమ్మాయి త్యాగం చేసింది. దానికి పెళ్ళి యోగం ఉందో లేదో! ఆ దేవుడికే ఎరుక" బాధపడింది ఆవిడ.

"కాఫీ తీస్కోండి" ఘుమఘుమలాడుతూ, పొగలు కక్కే, చక్కటి ఫిల్టర్ కాఫీ అందించింది సుగుణ.

కాఫీని ఆఖరు చుక్కవరకు ఆస్వాదించాడు సుదర్శన్.

"మరి నేను వెళ్ళొస్తానండి" అంటూ "సుగుణ గారూ మీ అమ్మగారిని తీసుకుని మా ఇంటికి రండి" అని తన అడ్రసు అందజేశాడు.

"అలాగేనండి వీలు చూసుకుని ప్రయత్నిస్తాను" అంది సుగుణ.

సుదర్శన్ వెళ్ళిపోయాడు.

పని ఒత్తిడిలో ఒళ్ళు తెలియక నిద్రపోయే సుదర్శన్‌కు గత కొద్ది రోజులుగా నిద్రపట్టడం లేదు. మనసు నిండా సుగుణ ఆలోచనలే. సుగుణకు పెళ్ళి కాలేదని తెలిసినప్పటి నుండి, మనసు ఇంకా రెస్ట్‌లెస్‌గా వుంది. ఈ వయసులో పెళ్ళి గురించిన ఆలోచన ఏవిటి?

ఇటీవల ఒక వారపత్రికలో ఒక ప్రముఖ సినీనటి అన్నట్టు ఇంగ్లండులో 50 ఏళ్ళ వరకూ, అమెరికాలో 60 ఏళ్ళ వరకూ యుక్త వయస్సేనంట. ఇండియాలో అసలు జీవితం మొదలయ్యేదే 40 ఏళ్ళ తరువాతేనట. ఆమె అభిప్రాయమేమయినా, సుదర్శన్ పెళ్ళి చేసుకోవడానికే నిర్ణయించుకున్నాడు. ఇదంతా కమలమ్మగారు గమనిస్తూనే వున్నారు.

> "ఏమిటండీ మీరు ఊరికే చూడ్డానికి వస్తామని చెప్పి, పెళ్ళి సంబంధం మాట్లాడ్డానికి ఇంత హఠాత్తుగా వస్తే నేనుగాని, మా అమ్మగాని ఏమి చెప్తాము చెప్పండి" అని నిలదీసింది.

"నాన్నా! సుదన్!

పనిఒత్తిడి ఎక్కువ వుంటే బ్యాంక్‌కి సెలవు పెట్టి కొద్ది రోజులు విశ్రాంతి తీసుకోరాదు" అని ఓదార్పుగా అంది.

"అది కాదమ్మా మీకు ఒక విషయం చెప్పాలని అనుకుంటున్నాను"

"ఏంటి! చెప్పు" అంది కమలమ్మ.

"నేను కొంత కాలం క్రితం ఒక అమ్మాయిని చూశాను. అమ్మాయి పేరు సుగుణ. పేరుకు తగ్గట్టుగా ఉంటుంది. వాళ్ళ అమ్మతో ఇక్కడికి దగ్గర్లోనే వుంటోంది. నాన్న లేరు. ఆ అమ్మాయికి కూడా పెళ్ళి కాలేదు. వాళ్ళ అమ్మ తప్ప బాధ్యతలు ఏమీ లేవు. కాని వాళ్ళమ్మ ఒంటరైపోతుందని ఆ అమ్మాయి పెళ్ళి చేసుకోలేదట" అని సుగుణ గురించి క్లుప్తంగా ముగించాడు.

కమలమ్మకు సంతోషమనిపించింది. కనీసం ఇప్పుడైనా పెళ్ళివైపు మనసు మళ్ళింది అనుకుంది.

"అమ్మా ! మీకు ఒకరోజు టైమ్ ఇస్తున్నాను. మీరు ఆలోచించుకుని ఏ విషయం నాకు చెప్పండి. ఎందుకంటే పెళ్ళయిన తరువాత సుగుణవాళ్ళమ్మ మనతోనే వుండవలసి వస్తుంది. మీ అనుమతి లేకుండా నిర్ణయం తీసుకోవడం నాకు ఇష్టం లేదు. సుగుణకు కూడా ఇంకా ఈ విషయం తెలియదు" అన్నాడు.

మరుసటి రోజు యథావిధిగా బ్యాంక్‌కి వెళ్ళి రాత్రి 9 గం.లకు వచ్చాడు. అప్పటికే పడుకునే అమ్మానాన్నలు అన్ని లైట్లు వేసుకుని, తలుపులన్నీ తెరచుకుని కొడుకు కోసం ఎదురు చూస్తున్నారు.

"ఏంటమ్మా ఇంకా పడుకోలేదా?" అని అడిగాడు సుదర్శన్.

"మనం ఆ అమ్మాయి ఇంటికి ఎప్పుడు వెళదాం సంబంధం మాట్లాడ్డానికి" అని అడిగింది కమలమ్మ.

సుదర్శన్ ఆశ్చర్యపోయాడు "అన్నీ ఆలోచించుకునే నిర్ణయానికి వచ్చారా?" అని అడుగుతూ "అయినా అమ్మాయి వాళ్ళు కదమ్మా సంబంధం మాట్లాడ్డానికి రావాలి?" అని ప్రశ్నించాడు.

"చూడు సుదన్ ! మాకు ఆ పట్టింపులు లేవు మీ పెళ్ళయిన తరువాత వాళ్ళ అమ్మగారు కూడా మనతో పాటే వుంటారు. ఇందులో తప్పేవుంది? ఇంట్లో మగదిక్కు లేకపోతే మనం ఆ మాత్రం సహాయం చేయలేమా! అయినా నీవు ఏరి కోరి చూసిన అమ్మాయి కాబట్టి మాకు ఆమాత్రం నమ్మకం ఉందిరా. మీ చెల్లెళ్ళకు సంబంధాలు చూసేటప్పుడు నీవు ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నావు!! అది మేము మరచిపోగలమా!" సుదీర్ఘంగా వివరణ ఇచ్చింది కమలమ్మ.

"అయితే శుభస్య శీఘ్రం! మనం వస్తున్నట్లు వాళ్ళకు చెప్తాను" అన్నాడు సుదర్శన్.

"ఆగరా! తొందర పడొద్దు. మీ నాన్న మంచిరోజు చూసి చెప్తారు. ఆ తరువాత చెప్తువుగాని" అంది కమలమ్మ.

మరుసటిరోజు కమలాకరరావుగారు ఒక మంచి రోజు చూసి సుదర్శన్‌కి చెప్పారు.

ఒక వారం గడువు ఉండడంతో సుగుణ బ్యాంక్ పనిమీద వస్తే చెప్తామని అనుకున్నాడు. రెండు రోజుల తరువాత సుగుణ బ్యాంకుకి వచ్చింది. తన దగ్గరకు వస్తుందనుకున్న సుగుణ నేరుగా కౌంటర్ దగ్గరకు వెళ్ళిపోయింది. ఇక తనే పనిని మధ్యలో ఆపి లేచి సుగుణ వైపు వెళ్ళాడు.

"హలో! సుగుణగారు" విష్ చేశాడు.

"హలో. ప్రతిసారి మిమ్మల్ని ఇబ్బంది పెట్టడం ఇష్టం లేక నేరుగా ఇక్కడికే వచ్చేశాను" అని క్షమాపణగా అంది.

"ఫరవాలేదులెండి. ఈ పాటి సాయం నేను చేయలేనా? అయినా నాకు ఈరోజు చాలా సంతోషంగా ఉందండి" అన్నాడు.

**ఇటీవల**
**ఒక వార్తపత్రికలో**
**ఒక ప్రముఖ సినీనటి అన్నట్టు**
**ఇంగ్లండులో 50 ఏళ్ళ వరకూ,**
**అమెరికాలో 60 ఏళ్ళ వరకూ యుక్త**
**వయస్సేనంట. ఇండియాలో**
**అసలు జీవితం మొదలయ్యేదే**
**40 ఏళ్ళ తరువాతేనట. ఆమె**
**అభిప్రాయమేమయినా, సుదర్శన్**
**పెళ్ళి చేసుకోవడానికే**
**నిర్ణయించుకున్నాడు.**

"అయితే రోజూ బాధపడుతున్నారా?" అని కిసుక్కున నవ్వింది.

సుగుణ నవ్వినప్పుడల్లా సుదర్శన్ మాటలు ఆగిపోతున్నాయి.

"చెప్పండి! ఎందుకు ఈరోజు సంతోషంగా వున్నారు?" అని అడిగింది.

"నేను వచ్చే శుక్రవారం సాయంత్రం 6 గం.లకు మా అమ్మా నాన్నలతో మీ ఇంటికి వస్తున్నాను" అని హ్యాపీ మూడ్‌లో చెప్పాడు సుదర్శన్.

"అదేవిటి ! ఇంత సడన్‌గా.... మీ అమ్మా నాన్నలతో... మా ఇంటికి" మాటలు తడబడుతూ అడిగింది సుగుణ.

"ఏమీలేదు! మంచి వాళ్ళంటే మా అమ్మా నాన్నలకు చాలా ఇష్టం. నేను మీ గురించి, మీ మంచితనం గురించి చెప్పాను. అయితే మిమ్మల్ని తప్పక చూడాలన్నారు. అందుకే అపాయింట్‌మెంట్ ఫిక్స్ చేశాను." అని ఒక స్టేట్‌మెంట్ ఇచ్చాడు సుదర్శన్.

"ఏమోనండి. నాకు చాలా భయంగా వుంది. మీరు రాకూడదని కాదు. సరే ఇంకా టైముంది కాబట్టి మనసు కుదుట పరచుకుంటాను" అంది సుగుణ.

ఆరోజు రానే వచ్చింది. సుదర్శన్ మేనేజర్ దగ్గర అతి కష్టం మీద పర్మిషన్ తీసుకుని త్వరగా బయలుదేరి వెళ్ళిపోయాడు.

సరిగ్గా ఆరుగంటలకు సుదర్శన్, అమ్మా నాన్నల్ని వెంటబెట్టుకొని సుగుణ ఇంటికెళ్లాడు. ఆమె చక్కటి స్కై బ్లూ చీరకట్టులో ఎప్పటిలాగే నిండుగా కప్పుకుని వాళ్ళను సాదరంగా ఆహ్వానించింది.

పరస్పర పరిచయాల తరువాత అసలు విషయానికి వచ్చారు సుదర్శన్ తల్లిదండ్రులు.

మొదట సంతోషించినా, సుగుణ వాళ్ళమ్మ కొంచెం ఆలోచించింది.

"ఇది అమ్మాయి పెళ్ళి వ్యవహారం. మీ అబ్బాయేమో బ్యాంక్ ఆఫీసర్, మా అమ్మాయి కొంత వరకు చదువుకుంది గాని, నాకోసం ఉద్యోగం చేయడం లేదు. ఈ పరిస్థితుల్లో నాకు కొంత సమయం కావాలి" అని అడిగింది.

"ఇవే మీ సమస్యలైతే మీరు ఆలోచించవలసిన అవసరం లేదు. అయినా మీరు కొంత సమయం అడిగారు కాబట్టి మీరు ఆలోచించుకొని చెప్పండి" అన్నారు సుదర్శన్ అమ్మా,నాన్నలు.

"సుదర్శన్ గారూ ! మీరు ఒక్కసారి ఇటు వస్తారా" అని పిలిచింది బయటకు వెళుతూ సుగుణ.

"చెప్పండి" అని వెనకే వెళ్ళాడు సుదర్శన్.

"ఏవిటండీ మీరు ఊరికే చూడ్డానికి వస్తామని చెప్పి, పెళ్ళి సంబంధం మాట్లాడ్డానికి ఇంత హఠాత్తుగా వస్తే నేనుగాని, మా అమ్మగాని ఏం చెప్తాం చెప్పండి" అని నిలదీసింది.

"ముందుగా చెప్తే మీరు ఏవనుకుంటారో! మీ మనసులో ఏవుందో నాకు తెలియదు కదా! ఈ విషయం ముందే ప్రస్తావిస్తే, మీరు నన్ను ఒక దుర్మార్గుడుగా, ఒక కుసంస్కారిగా ఊహించుకుంటే... అందుకని పెద్ద వాళ్ళతో వస్తే అన్నీ సర్దుకుంటాయి..." అన్నాడు సుదర్శన్.

"మీరు నాకు నచ్చారు, సుగుణగారూ! పెళ్ళి చేసుకోవాలని నిర్ణయించుకున్నాను. మీ అభిప్రాయం మీదే

మన పెళ్ళి ఆధారపడి ఉంటుంది. మా అమ్మా నాన్నలకు అన్ని విషయాలు చెప్పాను. పోతే.... కట్నకానుకలు... నో, పెళ్ళి దుబారా.... నో, రిజిస్టర్ మ్యారేజ్ ... యస్., మీ అమ్మ మనతో ఉండటానికి, యస్!!! " అని ముగించాడు.

సుగుణ ఉక్కిరి బిక్కిరి అయింది. ఏం చెప్పాలో అర్థంకాలేదు "సరే మీ ఇష్టం" అంది.

"మీకు మనస్ఫూర్తిగా ఇష్టమేకదా?"

"ఇంత దూరం వచ్చాక ఇంకా 'మీరు' అంటారెందుకు? 'నీవు' అనలేరా !" అని భార్య స్థానాన్ని సూచించింది.

"వెరీ నైస్ సుగుణా! అయితే రేపే మీ అభిప్రాయం కోసం ఎదురు చూస్తుంటాను" అన్నాడు.

ఆరోజు మాటలు ముగిశాయి. మరుసటి రోజు సుగుణ బ్యాంకుకు వచ్చి వాళ్ళ అమ్మగారు పెళ్ళికి సమ్మతించారని చెప్పింది.

సుదర్శన్‌కి ఎగిరి గంతెయ్యాలనిపించింది. సుగుణకు కృతజ్ఞతలు తెలియచేసుకున్నాడు.

పెద్దలు నిర్ణయించిన రోజు రిజిస్ట్రార్ ఆఫీసులో రిజిస్టర్ మ్యారేజ్ జరిగింది. అంచనాలకు ఏమాత్రం తీసిపోకుండా సుగుణ వాళ్ళ అమ్మని, అత్తమామలను, భర్తను ఎంతో ఆప్యాయంగా చూసుకుంటోంది.

ఒకరోజు సుదర్శన్ బెడ్ పైన వెల్లకిలా పడుకుని, రెండు చేతులు తలకింద పెట్టుకుని రూఫ్ వైపే చూస్తూ ఏదో ఆలోచిస్తున్నాడు. సుగుణ తన జీవితానికి సరైన భాగస్వామి దొరికినందుకు సంతోషిస్తూ సుదర్శన్ గుండెలపై తలవాల్చి పడుకుని "ఏవిటండీ ఆలోచిస్తున్నారు!" అని అడిగింది.

"పెళ్ళి వద్దని నేను, పెళ్ళికి అవకాశమే లేదని నీవు అలాగే వుండివుంటే జీవితంలో ఎంతో కోల్పోయి వుండేవాళ్ళం. ఈ సందర్భంలో నాకు శ్రీశ్రీ గారి పాట గుర్తుకొస్తోంది" అన్నాడు.

"ఏవిటది" అడిగింది సుగుణ.

"మనసున మనసై, బ్రతుకున బ్రతుకై
తోడొకరుండిన అదే భాగ్యము...."

".... అదే స్వర్గము" అంది సుగుణ.



చిత్రకారుడు :

- పోరుమాళ్ళ వెంకటేశ్వరరావు